మూర్తి ఆరోజు ఆదివారం కావటం చేత భోంచేసి విశ్రాంతిగా యీజీ చేరులో కూర్చుని సిగరెట్ పొగ చిరు మేఘాలు కల్పిస్తూ భార్య ఎప్పుడొచ్చి తమలపాకులిస్తుందా అని ఒకే ధ్యాసగా పేపరు చదువుతున్నాడు.

మూర్తి ఆ వూరి ఒక లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంటు మేనేజరు. నెలకు రూ 150 లు జీతమిస్తారు. భార్య లక్ష్మీ కూడా కొద్దిగా చదువుకొని అప్టుడేట్ ఫేషన్లకు బాగా అలవాటుపడినా భర్తమీద మంచిప్రేమగౌరవాలున్నాయి. "నీకూ నీవారు లేరు నాకూ నావారు లేర"న్నట్లుగా మూర్తికి తల్లిదండ్రులు గాని అన్నదమ్ములుగాని ఎవరూ లేరు. ఇటు లక్ష్మికిమాత్రం "నీకు యింటి చాకిరీ ఏం అవుసరంలేదు నీ మొగుడితో సీతాకోక చిలుకలాగుండు. దానికి నే నున్నాను" అని లక్ష్మి తల్లి మాత్రం కూతురి సుఖంకోసం అన్నట్టు కూతుర్ని అల్లుణ్ణి కనిపెట్టుకువుంది.

ఇంతలోకే లక్ష్మి కూడా భోంచేసి వక్కపొడిడబ్బా ఆకులపొందాను పట్టుకొని భర్తవద్దకు వచ్చి చాపమీద చతికిలపడి ఆకులకు సున్నం రాయనారంభించింది.

"ఏమండీ"

"................"

"పలకరేమండీ"

"................"

"ఏమిటండీ, ఆ చదువు మరీ పిలుస్తూంటేను?"

"హుష్, ఉండు చదువుకుంటూంటే ఏమిటి నీ గోల?"

"ఓ యిదేమిటండీ, రోజూ మీరేమో మీ ఆఫీసేమో! యింట్లో నాకు తోచనే తోచదు. పోనీ ఆదివారం సెలవురోజునైనా, సరదాగా మాట్లాడుదామంటే పేపర్ చదువులు, అందులో ఏముంటవి చట్టబండలు. మీ మగవాళ్లకున్న పాడు బుద్ధులే యివి."

అగు! అగు! ఏమిటలా రెచ్చిపోతున్నావు. ఇంతకూ అసలుసంగతి ఏమిటి?

"ఏమీ లేదు. మీరు "సంసారం"కి వెళ్లారుగదా? నన్ని ఒక్కరాత్రి "ఒక రాత్రి"కి తీసికెళ్ళరూ?"

"సంసారం సాగరం ఒకరాత్రిలేదు మొదటిరాత్రిలేదు. తెచ్చిన జీతంరాళ్ళు

# టాయిలెట్ పిచ్చి

రచన: అంబటిపూడి నారిబాబు

నాలుగు నీ సబ్బులకూ రిబ్బన్లకే చాలటంలేదు. ఇంకా సినిమాలంట సినిమాలు"

"అవునండీ. మీ మొగవాళ్ళు ఎన్నిపోకిళ్ళు పోయినా తప్పులేదు ఏనాటికో సరదాకి సినిమాకి పోదామంటే ఇలా ఖర్చుచేస్తున్నావు, అలా ఖర్చు చేస్తున్నావని, పెళ్ళాలమీద విరుచుకు పడతారు. గట్టిగా అంటే మేం చెమటోడ్చి తెస్తున్నాం. మా యిష్టం మాది అంటారు. అవసరంవుంటే ఎంతకైనా లొంగుతారు. అవుసరం తీరితే తెప్ప"

"ఆఁ ఆఁ నిలబడు. నేనేం నాస్వంత డబ్బుపెట్టుకు సినిమాకు పోలేదు. ఒక స్నేహితుడు బలవంతంచేసి తీసుకుపోతే వాడితో పోయాను"

"పోనీలెండి! నాకు సినిమా వద్దు ఏమీ వద్దు" అని లక్ష్మి "ఆషాఢస్య ప్రథమ దివసే" కామల్లే మొహం పెట్టింది.

"సరే పోనీ ఆలోచిద్దాం ఆకులివ్వు"

"ఇవిగో రాసుకోండి. నాకేం బాగాలేదు. నేను రాయలేను."

"పోనీ సినిమాకు తీసుకుపోతాగా రాసివ్వు."

"అక్కర్లేదు లెండి."

"అబ్బా లక్ష్మి నీకెంత ముక్కుమీద వుంది కోపం, ఏదీ ఎంత కోపం వుందో చూస్తాను."

"అబ్బ! వుండండి! వేళా పాళా లేదేమిటి?"

"ఒక్కటి ... ... ..."

"ఒక్కటి లేదు రెండూ లేదు"

"అబ్బే ఏదీ యిదొక్కటే" "ప్చ్"

"అబ్బా వుండండి, అంతా మోటు సరసమే, అంత గట్టిగానా? అయితే సినిమాకు పోదామా?"

"తప్పకుండా, కాని నీ టాయిలెట్ మాత్రం వేగం తెమల్చు."

సాయంకాలం అయిదు గంటలైంది. లక్ష్మి టాయిలెట్ కావటానికి ప్రారంభించింది.

"లక్ష్మి నీ టాయిలెట్ పూర్తి అయిందా?"

"అయిపోయింది అంటూ స్నో లావు అయిందని ఒకమాటు పౌడరు లావు అయిందని ఒకమాటు అరడజనుసార్లు సబ్బుతో ముఖము రుద్ది రుద్ది సబ్బు అరగగొట్టింది"

"లక్ష్మి అరున్నర కావచ్చింది. ఈ సర్కి మొఖము రుద్దడము కాలేదు. ఇంకా ఎప్పుడు తలదువ్వుకొని చీర కట్టుకుంటావు" అని అడిగేడు మూర్తి.

"ఇదిగో రెండు నిమిషాలే అయిపోయిందండి యింక చీరకట్టుకోవడం, స్నో రాసుకోవడం, పౌడరద్దుకోవడమే తరువాయి. ఏమండీ ఆకుపచ్చ జార్జెట్ చీరమీద రెడ్ వాయిల్స్ జాకెట్ తొడిగేదా, లేకుంటే నీలి వాయిల్సు చీర మీద............"

"నాకా ఫేషన్లు తెలియవు బాబు. ఏదో కానిచ్చి బయల్దేరు. నేను వీధిలో వుంటాను."

పావు తక్కువ ఏడు కావచ్చింది లక్ష్మి యింకా బయల్దేరలేదు. చల్లగా సినిమాకు జారుకున్నాడు మూర్తి. పది గంటలకు సినిమానుంచి యింటికి చేరుకున్నాడు. చడిచప్పుడు లేకుండా పడకగదిలోకి తొంగిచూసేడు, లక్ష్మి ఇంకా చీరలు ఎంచుతోంది. వంటింటి వేపు దారితీశాడు. అత్తగారు వంటింటి అరుగుమీద తలకిందకు పీటను దిండుగా చేసుకొని గురకలు పెట్తోంది. వంటింట్లోకిచూచేడు. కంచాలు, పీటలు అవి సిద్ధంగా వున్నాయి. లాంతరుమీద నెయ్యి కరుగుతోంది. గమ్మున తానే వడ్డించుకొని భోజనంపూర్తిచేసి గదిలో మంచమెక్కాడు వచ్చే నవ్వు నాపుకుంటూ.

"మరి మంచమెక్కకండి పదండి"

"ఇంకెక్కడికి పదేది, నేను మొదట ఆట సినిమాకు వెళ్ళివచ్చి మీ అమ్మగారు నిద్దరోతుంటే నేనే వడ్డించుకొని తిన్నాను. నువ్వుకూడా పోయి భోంచేసి వచ్చి పడుకో."

"ఆఁ! అదేమిటండీ?" అంటూ లక్ష్మి మొగుడి చేతినున్న గడియారం చూచింది. పదిన్నర.

పాపం లక్ష్మికి కళ్లనీళ్ల పర్యంతం అయింది.